# కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధు బంద్

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- దేవరకొండలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్, వేదికపై మంత్రి జగదీశ్‌రెడ్డి

దేవరకొండ, నవంబర్ 3 : కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధు బంద్ అవుతుందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆరడుగుల ఎత్తు ఉండి ప్రజల రక్తం తాగారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే రైతుబంధు నాయకుల జేబుల్లోకి వెళ్తుందని, అదే బీఆర్ఎస్ వస్తే రైతుల ఖాతాల్లోకి జమవుతుందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుబంధు, బీమా, కేసీఆర్ కిట్టు, అమ్మఒడి పథకాలు అమలవుతున్నాయన్నారు. గత పాలకుల పాలనలో కన్నపిల్లలను అమ్ముకునే సంస్కృతి ఇక్కడ ఉండేదని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. దేవరకొండలో రమావత్ రవీంద్రకుమార్‌కు ఓటేసి నాలుగోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుక ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలు ఉండదన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకంతో పేదలందరికీ ఇల్లు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. కార్మిక నాయకుడైన హన్మంత్ చంద్రన్న కుమారుడు వెంకటేశ్‌గౌడ్‌కు సరైన న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి కాంగ్రెస్ పార్టీకి పోయిన వారిని పట్టించుకోవద్దని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే మనకు అండగా ఉంటాయన్నారు. ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ వెంకటేశ్‌గౌడ్‌కు పార్టీలో సరైన గౌరవం అందలేదని, వచ్చే రోజుల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో న్యాయం చేస్తామని హామీనిచ్చారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం వచ్చే ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని సూచించారు. దేవరకొండ ఖిల్లాపై మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ రమావత్ రవీంద్రకుమార్ ఎంతో సౌమ్యుడని ఎమ్మెల్యేగా నాలుగోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశానికి సుమారు 4వేల మంది హాజరయ్యారు. హన్మంత్ వెంకటేశ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాకులు కేతావత్ బీల్యానాయక్, వడ్త్య రమేశ్‌నాయక్, కంకణాల వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీలు మారుపాకుల అరుణాసురేశ్‌గౌడ్, కేతావత్ బాలూనాయక్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు టీవీఎన్‌రెడ్డి, లోకసాని తిరుపతయ్య, ముత్యాల సర్వయ్య, రాజీనేని వెంకటేశ్వర్‌రావు, మారుపాకుల సురేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు తూం నాగార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వైస్ చైర్మన్ రహత్‌అలీ, బీఆర్ఎస్ నాయకులు నాయిని సుధీర్‌రెడ్డి, ఏడ్పుల గోవింద్‌యాదవ్, రవికుమార్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గోపాల్‌రెడ్డి

# సొంత గూటికి పాశం గోపాల్‌రెడ్డి

- మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక
- వరుస రాజీనామాలతో గుర్రంపోడులో బీజేపీ ఖాళీ

గుర్రంపోడ్, నవంబర్ 3 : మండలానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డితో మరికొందరు ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో పాశవారిగూడెం సర్పంచ్ పాశం అలివేలమ్మ, బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి, నియోజవర్గ నాయకులు మల్లోజు నాగార్జున చారి, బీజేపీ నాయకులు పాశం వేణుగోపాల్‌రెడ్డి, నియోజవర్గ నాయకులు కుప్పం పృథ్వీరాజ్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు మాలె రవీందర్‌రెడ్డి, బీజేపీ మోర్చా జిల్లా కార్యదర్శి అందుగుల ఆనంద్, బీజేపీ నియోజకవర్గ నాయకులు పాల్వాయి సైదులు, ముక్కాముల సైదులు, పాల్వాయి కొండల్, బీజేపీ మండల నాయకులు కత్తుల రమేశ్, ముక్కామల రమేశ్, సిరవోని మహేశ్, మేడి విఘ్నేశ్, మేడి సంజీవ, మారుపాక రాములు, కొండమీది సురేశ్, మూల్కాసిరి యాదయ్య, షేక్ అమీర్ ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాదం సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

### చౌటుప్పల్ నాయకుల చేరిక

చౌటుప్పల్ : మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రముఖ బాధ్యులు బీఆర్ఎస్‌లోకి క్యూ కడుతున్నారు. ఉప ఎన్నిక సమయంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన వారు సైతం తిరిగి చేరుతున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో చౌటుప్పల్ నుంచి మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, ప్రస్తుత సర్పంచులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, పెద్దిటి హేమలతాచంద్రారెడ్డి, చిన్నం లావణ్యామల్లేశం, బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు నరేశ్ బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు నియోజకవర్గంలో ప్రముఖ నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం ఉన్నారు. మరి కొన్నిరోజుల్లో ఈ వలసలు మరింత పెరుగనున్నాయి.

# గుట్టలో వైభవంగా సుప్రభాత సేవ



సుదర్శన నారసింహ హోమం చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, నవంబర్ 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సుప్రభాత సేవోత్సవాన్ని అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు 'కౌసల్యా సుప్రజా రామ పూర్వ సంధ్యా ప్రవర్తతే' అంటూ స్థాన సుప్రభాతాన్ని ఆలకించి స్వామిని మేల్కొల్పి తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేశారు. నిజరూప దర్శనంలో స్వయంభువుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాల ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామి వారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాలు పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతు జరిపించారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతు జరిపించారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్టించి నిత్య కల్యాణ తంతు జరిపించారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. సాయంత్రం వేళలో స్వామి వారికి తిరువీధి, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళలో స్వామి వారికి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేశారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.20,01,417 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.

# ఉర్సులో భక్తజన సందడి

- భక్తిశ్రద్ధలతో దర్గా మెట్ల వద్ద దీపాలంకరణ

రామగిరి, నవంబర్ 3 : మత సామరస్యానికి ప్రతీకైన నల్లగొండలోని గడియారం సెంటర్‌లో గల హజరత్ సయ్యద్ లతీఫ్ షా వలీ దర్గా ఉర్సు ఉత్సవాలు రెండోరోజు శుక్రవారం కొనసాగాయి. శుక్రవారం కావడంతో నల్లగొండ ఉమ్మడి జిల్లాతో పాటు పరిసర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ముస్లింలు, హిందువులు పెద్ద ఎత్తున హాజరై ప్రార్థనలు చేశారు. అదేవిధంగా దర్గా వద్ద ఏర్పాటు చేసిన మెట్ల వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. అదేవిధంగా దుకాణాల వద్ద సందడి కనిపించింది. రాత్రి దర్గా మెట్ల వద్ద జుమ నమాజ్ అనంతరం ఖురాన్ పఠనం చేసి ప్రసాదం పంపిణీ చేశారు. అదేవిధంగా దీపాలంకరణ చేశారు. వేడుకల్లో దర్గా ముతవల్లులు రషీద్ ఖాద్రీ సాహెబ్, జమాల్ ఖాద్రీ, ఉర్సు ఉపాధ్యక్షుడు సయ్యద్ జాఫర్ పాల్గొన్నారు.



గుట్ట కింద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

# ఎంజీయూలో హోరాహోరీగా కబడ్డీ పోటీలు



మహిళా కబడ్డీ పోటీల విజేత భువనగిరి టీమ్‌కు బహుమతి అందిస్తున్న స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి

- ఉమ్మడి జిల్లా కళాశాలల నుంచి క్రీడాకారుల హాజరు

రామగిరి, నవంబర్ 3 : నల్లగొండలోని ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టిన ఐసిటి(ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్) పురుషులు, స్త్రీల కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని ఎంజీయూ అనుబంధ కళాశాలల నుంచి తరలివచ్చిన విద్యార్థుల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను ఎంజీయూ ఓఎస్డి అల్వాల రవి, ఆడిట్ డైరెక్టర్ కొప్పుల అంజిరెడ్డి కబడ్డీ ఆడి పోటీలు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తూ ఎంజీయూలో ఆధునిక టెక్నాలజీతో క్రీడా మైదానాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో ఎంజీయూ ఖ్యాతి చాటాలన్నారు. అదే విధంగా పురుషుల కబడ్డీ పోటీలను ఎంజీయూ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అరుణప్రియ ప్రారంభించారు. ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జి.ఉపేందర్‌రెడ్డి మట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 మహిళ, 13పురుషుల జట్లు వచ్చినట్లు తెలిపారు. శనివారంతో క్రీడలు ముగుస్తాయన్నారు. వీటిలో ప్రతిభ చూపిన స్త్రీ, పురుష విద్యార్థులను ఎంజీయూ జట్టుకు ఎంపిక చేసి త్వరలో జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మురళి, వివిధ కళాశాలల పీడీలు కడారి మల్లేశ్ పాల్గొన్నారు.

### మహిళా జట్టు విజేతలు వీరే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12కళాశాలల నుంచి మహిళా జట్లు పాల్గొనగా పోటీలు శుక్రవారంతో ముగిసాయి. పోటీల్లో ప్రథమ స్థానంలో తెలంగాణ సాంఘీక సంక్షేమ శాఖ సైనిక మహిళా డిగ్రీ కళాశాల – భువనగిరి, ద్వితీయ స్థానంలో ఎన్జీ కళాశాల – నల్లగొండ జట్లు నిలిచాయి. వీరిని ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి అభినందించి బహుమతులు అందించారు. శనివారం వీరిలో నుంచి వర్సిటీ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక చేస్తామన్నారు.